రేవంత్, చంద్రబాబుతో హైదరాబాద్‌కు ప్రమాదం

అందుకే బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలె

- బీజేపీ పాలనలో దేశం తిరోగమనం
- రాజ్యాంగ మార్పు అవగాహనలేని మాటలు
- రాజీవ్ రహదారిని ఎక్స్‌ప్రెస్ హైవే చేస్తాం
- బండి సంజయ్ చెప్తున్న లెక్కలు హాస్యాస్పదం
- ఐదేండ్లలో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు గొంతు విప్పలె
- పాలనలో కాంగ్రెస్ ఘోరంగా విఫలం
- త్రిముఖ పోరులో విజయం నాదే
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబుతో హైదరాబాద్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయంలో ఇద్దరు కలసి ఏదైనా చేసే అవకాశముంది.' అని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అనుమానం వ్యక్తం చేశారు. 400 మంది ఎంపీలను గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చుతామని చెప్పేవారికి అవగాహన లేదని విమర్శించారు. పార్లమెంట్‌లో జాతీయ పార్టీ ఎంపీలే ఉండాలనడం శుద్ధ తప్పన్న ఆయన, ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే ఎంపీలుగా ఉండాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. 'నమస్తే తెలంగాణ'కు ఆయన ఆదివారం ఇంటర్వ్యూ ఇచ్చారు.

నమస్తే: బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ ఐదేళ్లలో రూ.12 వేల కోట్లతో అభివృద్ధి చేశానంటున్నడు.. దీనిపై మీరేంటారు?

వినోద్: సంజయ్ చెప్తున్న లెక్కలన్నీ హాస్యాస్పదంగా ఉన్నయ్. ఎంపీగా ఎవరున్నా చట్ట ప్రకారం కొన్ని నిధులను కేంద్రం తప్పనిసరిగా ఇస్తుంది. 2005లోనే కేంద్రం ఈ చట్టం తెచ్చింది. ఉపాధిహామీ, పంచాయతీలకు నిధులు కేటాయింపు వంటివి ఇందుకు ఉదాహరణలు. ఈ నిధులు కూడా ఆయనే తెచ్చినట్టు చెబుతూ కరపత్రాలు పంచుతున్నడు. ఒక ఎంపీగా ఏనాడైనా సంజయ్ పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై నోరు విప్పారా?. రాష్ట్రానికి రావాల్సిన జాతీయ ప్రాజెక్టుల గురించి ప్రశ్నించారా?. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఏనైనా ప్రయత్నాలు చేశారా?. మనకు రావాల్సిన ట్రిపుల్ ఐటీ ని ఇతర రాష్ట్రాలు తన్నుకెళ్తే.. అడ్డుకునే ప్రయత్నమైనా చేశారా?. కొత్త జిల్లాలకు ఒక్క నవోదయ పాఠశాలనైనా తెచ్చారా? వైకుంఠధామాలు, మొక్కల పెంపకానికి, 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, చెత్తసేకరణ, పాలు, గుడ్లకు ఇచ్చే నిధులు కూడా తానే తెచ్చినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. అదీగాక కులమతాల పేరుతో యువతను రెచ్చగొడుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.

400 మంది ఎంపీలుగా గెలిస్తే.. రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ చేస్తున్న ప్రచారంపై మీరేమంటారు?

ఇది రాజ్యాంగం మీద అవగాహన లేని వాళ్లు మాట్లాడే మాటలు. రాజ్యాంగాన్ని మార్చేందుకు మూడు రకాల అవకాశముంది. మొదటిది సింపుల్ మెజార్టీ, రెండోది 2/3 మెజార్టీ, మూడోది 2/3 మెజార్టీతోపాటు దేశంలో సగం రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి. 400 సీట్లు గెలిచినా.. ఇంకేం చేసినా ఎవరి ఇష్టానుసారం వాళ్లు రాజ్యాంగాన్ని మార్చేందుకు వీలు లేదు. అభివృద్ధి చేసింది లేక ఇలా రాజ్యాంగాన్ని ముందుకు తెచ్చారు.

కాంగ్రెస్ హామీలు అమలు కాలేదని మీరు.. ఈ ఎన్నికలు రెఫరెండం అని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. దీనిపై మీరేమంటారు?

పరిపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. వంద రోజుల్లోనే వైఫల్యానికి కారణం ప్రధానంగా వారి పనితీరే. గోదావరి జలాలను తీసుకొచ్చి ప్రాజెక్టులు, చెరువులు నింపే అవకాశం ఉన్నా నింపకుండా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందిపెడుతున్నది. మేడిగడ్డ వద్ద రోజుకు ఐదువేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోంది. మూడు నెలల్లోనే దాదాపు 50 టీఎంసీల నీళ్లు సముద్రం పాలైనయ్. కేసీఆర్ గెలిచి ఉంటే.. ఇప్పటికే కాపర్‌డ్యాం నిర్మించి నీటిని ఎత్తిపోసేవారు. కాంగ్రెస్ నిర్వాకం వల్ల ఈరోజు వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. తాగునీటి కటకట వచ్చింది.

జాతీయ పార్టీల ఎంపీలుంటేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంపై మీరేమంటారు?

తెలంగాణ సోయి, స్పృహ ఉన్న ఎంపీలు ప్రస్తుతం పార్లమెంట్‌లో ఉండడం అత్యవసరం. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు గెలిచినా.. తెలంగాణను అగం చేస్తరు తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలకోసం పాటుపడరు. ఒక్క మాట చెప్పాలంటే హైదరాబాద్ మహానగరానికి ప్రమాదం పొంచి ఉందని నేను ఘంటాపథంగా చెప్తున్నా. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీడీపీ చంద్రబాబు కలిసి ఏమైనా చేయొచ్చు. అలాంటి పరిస్థితి వస్తే పార్లమెంట్‌లో గట్టిగా మాట్లాడేది బీఆర్ఎస్ ఎంపీలే. బీజేపీ నుంచి నలుగురు, కాంగ్రెస్ నుంచి ముగ్గురు ఎంపీలు గెలిచి తెలంగాణ హక్కులపై ఏనాడైనా పార్లమెంట్‌లో మాట్లాడారా? తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీల్లాంటి పేద పిల్లలకు నవోదయలో సీటొస్తే వారి తల్లిదండ్రులు సంతోషిస్తారు.

మీకు ప్రత్యర్థి ఎవరని భావిస్తున్నారు?

బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ మూడు పార్టీల మధ్య పోటీ ఉంటుందని నేను భావిస్తున్న. నేను ఎంపీగా ఉన్నప్పుడు చేసిన పనులు, బండి సంజయ్ చేసిన పనులు, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు బేరీజు వేసుకుంటున్నరు. ఏ కోణంలో చూసినా ప్రజల మద్దతు నావైపే ఉంది.

నియోజకవర్గ ఓటర్లకు ఏం చెప్పదలుచుకున్నరు?

నేను చిన్నప్పటి నుంచే విద్యార్థి రాజకీయాల్లో ఉన్న. వామపక్ష రాజకీయ నేపథ్యం నుంచి వచ్చిన. తెలంగాణ కోసం ఏర్పాటైన బీఆర్ఎస్‌లో నేనొక వ్యవస్థాపకుడిని. నాడు తెలంగాణ కోసం, నేడు తెలంగాణ సంక్షేమం దాదాపు 2001నుంచి నా జీవితాన్ని అంకితం చేసిన. ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తా. ఐదేళ్లలో బండి సంజయ్ నియోజకవర్గానికి లేదా తెలంగాణకు ఏమైనా చేశాడా? కేంద్రంలో వారి ప్రభుత్వమే ఉన్నా గోదావరి, కృష్ణ ప్రాజెక్టులకు జాతీయహోదా తెచ్చేందుకు కృషి చేశాడా? ఒక్కసారైనా ఆ వాటి గురించి మాట్లాడిండా? అవన్నీ బేరీజు వేసుకొని ఓటేయ్యాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తిచేస్తున్న.

ఎంపీగా గెలిపిస్తే.. ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తారు?

కరీంనగర్‌లో ముఖ్యంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయిస్తా? 150 ట్రేడ్స్ ఉన్న సెంటర్‌ను నేను సింగపూర్‌లో స్వయంగా చూసిన. ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)గా సింగపూర్‌కు ప్రపంచ ఖ్యాతి ఉంది. యూట్యూబ్‌లో సెర్చ్ చేస్తే దాని గొప్పదనం తెలుస్తుంది. ఇలాంటిదే కరీంనగర్‌లో ఏర్పాటు చేయిస్తా. అంతేకాకుండా కరీంనగర్‌ను ఎడ్యుకేషన్ హాబ్‌గా తీర్చిదిద్దుత. ఐఐటీ, ఐఎస్ఈర్, ఐఐఎం లాంటి కేంద్ర విద్యా సంస్థలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. గెలిపిస్తే ట్రిపుల్ ఐటీ తీసుకొస్తా. నవోదయ స్కూళ్లను సాధిస్త. సిరిసిల్ల, కరీంనగర్ ప్రాంతాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం కృషి చేస్త. జిన్నింగ్ మిల్లులు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో టెక్స్‌టైల్ ఇండస్ట్రీలు ఏర్పాటు చేస్తాం. వేములవాడ, కొండగట్టు లాంటి ఆలయాలను ప్రసాద్ స్కీంలో చేర్పించి అభివృద్ధి చేస్తా. రాజీవ్ రహదారిని జాతీయ ఎక్స్‌ప్రెస్ హైవేగా ప్రకటింపజేస్తా. కాజీపేట-కరీంనగర్, కరీంనగర్-పిట్లం, కరీంనగర్-భూపాలపల్లి, కరీంనగర్-రాయపట్నం వంటి రహదారులపై ప్రత్యేక దృష్టిపెడుతా. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ పూర్తిచేయిస్తా.

హనుమకొండ జిల్లా ఐనవోలులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్. చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఏ సర్వే చూసినా బీఆర్ఎస్‌దే గెలుపు

- ఎంపీ ఎన్నికల్లో కేసీఆర్ వెంటే ప్రజలు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు, ఏప్రిల్ 21: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని, ఏ సర్వే చూసినా వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్సే గెలువబోతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలులో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలు వస్తలేవని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న పథకాలు ఇంకా మొదలే కాలేదని విమర్శించారు. కడియం శ్రీహరి లాగా అధికారం కోసం తాను పార్టీలు మారే మనిషిని కాదని గుర్తుచేశారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో తాను ఒక సామాన్య కార్యకర్తనని, తన సేవలను గుర్తించి కేసీఆర్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే తాగడానికి, పంటకు నీళ్లు, కరెంటు ఇవ్వకుండా తెలంగాణ ప్రజలను అరిగోస పెడుతున్నదని మండిపడ్డారు. హక్కులు దక్కాలంటే.. కేంద్రంతో కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ ఉండాలని పేర్కొన్నారు. జిల్లా నాయకులు వాసుదేవరెడ్డి, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క తడికీ నీరివ్వలేని అసమర్థ సీఎం రేవంత్

- గుర్రంపోడ్, కనగల్ బీఆర్ఎస్ ప్రచారంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి

గుర్రంపోడ్, ఏప్రిల్ 21: యాసంగిలో వరిసాగు చేసిన రైతులకు ఒక్క తడికి కూడా నీరివ్వక, పంటలను ఎండబెట్టిన అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని, మాయమాటలతో ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం నల్లగొండ జిల్లా గుర్రంపోడ్, కనగల్ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీళ్లు ఉన్నా.. ఇక్కడి నుంచి కాల్వల్లోకి నీళ్లు వెళ్లినా పంటలకు మాత్రం నీరివ్వలేదని విమర్శించారు. దీంతో రెండున్నర లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉంటే నీళ్లు, కాంగ్రెస్ వస్తే కన్నీళ్లు వస్తాయని రైతులకు తెలిసిందని చెప్పారు. పంటలను కాపాడాల్సిన బాధ్యత గల సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు రైతులను ఆదుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. రూ.4వేల పింఛన్ ఇస్తామని, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి వాటిని అమలు చేయక ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నోముల భగత్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	44.9°c	24.4°c
ఖమ్మం	42.0°c	27.0°c
నల్లగొండ	41.0°c	25.2°c
మెదక్	40.6°c	20.6°c
వరంగల్	40.0°c	27.0°c
కరీంనగర్	39.0°c	27.0°c
హైదరాబాద్	38.8°c	25.9°c
మహబూబ్‌నగర్	38.4°c	28.1°c
నిజామాబాద్	38.0°c	25.2°c
రంగారెడ్డి	37.8°c	21.1°c

మరో నాలుగు రోజులు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో రాగల నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. ఆదివారం నుంచి సోమవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతోపాటు నిజామాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డిలో వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ , పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. బుధవారం నుంచి గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

శంకరపట్నం, ఏప్రిల్ 21: వడదెబ్బకు ఓ వృద్ధుడు మృతిచెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని తాడికల్‌కు చెందిన బుద్ధార్థి నర్సయ్య (70) శుక్రవారం పొద్దంతా పొలం వద్ద ఉన్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. వడదెబ్బకు గురైనట్టు గుర్తించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స చేయించి శనివారం ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం మధ్యాహ్నం నర్సయ్య మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వాతావరణ వార్తలు చదువుతూ కుప్పకూలిన యాంకర్

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఎండల తీవ్రత గురించి వార్తలు చదువుతూ ప్రత్యక్ష ప్రసారం జరుగుతున్న సమయంలోనే దూరదర్శన్ యాంకర్ లోపాముద్ర సిన్హా కుప్పకూలిపోయారు. తన పరిస్థితిని ఆమె ఫేస్‌బుక్ పోస్ట్‌లో వివరిస్తూ, హఠాత్తుగా తన బ్లడ్ ప్రెషర్ వేగంగా తగ్గిపోయిందని, కుప్పకూలిపోయానని చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందే తన ఒంట్లో నలతగా అనిపించిందని తెలిపారు. అది ప్రత్యక్ష ప్రసారం కావడంతో తాను ఎక్కువసార్లు నీటిని తాగలేకపోయానని తెలిపారు. క్రమంగా తన కళ్లు చీకట్లు కమ్మాయని, తాను చూడలేకపోయానని చెప్పారు. తన మాటలు తడబడ్డాయని, చివరికి టెలిప్రాంప్టర్ మసక మసకగా కనిపించిందన్నారు.

కాంపౌండర్ సర్జరీ.. గర్భిణి మృతి

పాట్నా, ఏప్రిల్ 21: వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఓ గర్భిణి ప్రాణాన్ని బలి తీసుకొంది. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో కాంపౌండర్ చేసిన సిజేరియన్ వికటించి బబితాదేవి(28) ప్రాణాలు కోల్పోయింది. బీహార్ రాజధానికి 80 కిలోమీటర్ల దూరంలోని ముస్రిగ రాయ్ పట్టణంలోని అనిశా హెల్త్‌కేర్ సెంటర్‌లో ఈ దారుణం జరిగింది. బబిత మృతికి వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువులు దవాఖాన ముందు ధర్నా చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవుళ్లపై ప్రమాణం.. కోడ్ ఉల్లంఘనే

- ఎంపీ సీట్లు గెలువకపోతే ముఖ్యమంత్రి పదవి పోతుందన్న భయంతోనే దేవుళ్లపై రేవంత్ ఒట్లు
- హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం
- కేసీఆర్ బస్సు యాత్రతో బీఆర్ఎస్‌కు బలం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ ఎంపీ సీట్లు రాకపోతే ముఖ్యమంత్రి పదవిని కోల్పోతానన్న భయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నడూ లేనివిధంగా దేవుళ్లపై ప్రమాణం చేస్తున్నారని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైనందున రేవంత్ తన ముక్కు నేలకు రాసి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ హామీలను నెరవేర్చలేక ఆయన దేవుళ్లను వాడుకునే ప్రయత్నం చేస్తున్నాడని, అందులో భాగంగానే ఇటీవల భద్రాద్రి రాముడితోపాటు మెదక్‌లోని ఏడుపాయల వనదుర్గాదేవి వద్దకు, చర్చిల వద్దకు వెళ్లి ఒట్లు వేశారని ఎద్దేవా చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు బీఆర్ఎస్ లీగల్ టీమ్‌తో చర్చిస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తథ్యమన్న అసహనంతో రేవంత్ తన ముఖ్యమంత్రి హోదాను మర్చిపోయి దిగజారి మాట్లాడుతున్నారని, ఆయన భాష తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలపై మాట్లాడాలని హితవు పలికారు.

రైతుల్ని పట్టించుకునే దిక్కే లేదు..

రాష్ట్రంలోని రైతులు అకాల వర్షాలతో ఆగమాగం అవుతున్నారని, కల్లాలతోపాటు కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిచిపోతున్నాయని వివేకానంద ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎక్కడా పంట కొనుగోళ్లు జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ ప్రభుత్వంలో రైతులకు దిక్కు లేకుండా పోయిందని, తాగునీరు, సాగునీరు, విద్యుత్తుపై సమీక్షించే నాథుడే లేడని ధ్వజమెత్తారు. సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి మీటింగ్‌లకే విద్యుత్తు సరఫరా లేకపోతే ఇక సామాన్యుడి పరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించారు. రేవంత్‌కు దమ్ముంటే ముందు ఆయన విధానాలను వ్యతిరేకిస్తున్న వీ హన్మంతరావు, సర్వే సత్యనారాయణ, మోత్కుపల్లి నర్సింహులు లాంటి వారికి సమాధానం చెప్పాలన్నారు. రేవంత్ బీజేపీకి లోకి వస్తాడని చెప్తున్న ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలపై కూడా సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు.

పైరవీలకు అడ్డాగా సీఎం నివాసం

రాష్ట్ర సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ముఖ్యమంత్రి నివాసం కూడా పైరవీలకు అడ్డాగా మారిందని వివేకానంద దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో దేదీప్యమానంగా వెలుగొందిన హైదరాబాద్ నేడు ఎందుకు గోసపడుతున్నదో, రియల్ ఎస్టేట్ రంగం ఎందుకు కుదేలైందో, గత నాలుగు నెలలుగా కొత్త నిర్మాణాలకు ఎందుకు అనుమతి ఇవ్వలేదో సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను రేవంత్ హోల్‌సేల్‌గా అమ్మేస్తారని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, గడ్డం రంజిత్‌రెడ్డిపై ఆ పార్టీ క్యాడర్ తిరుగుబాటు చేస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రతో పార్టీకి బలం చేకూరుతుందని, లోక్‌సభ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు రావడం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లో రోడ్‌షోలు నిర్వహించనున్నట్టు వివేకానంద తెలిపారు.

ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

నాలుగు నెలల్లోనే సంక్షోభంలోకి రాష్ట్రం

- సంక్షేమ పథకాలను కొనసాగించే పరిస్థితి లేదు
- పదేండ్ల తర్వాత మళ్లీ సాగు, తాగునీటి కష్టాలు
- బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా, ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ

కారేపల్లి, ఏప్రిల్ 21: నాలుగు నెలల కాంగెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని వైఎస్ఎన్ గార్డెన్‌లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బానోత్ మదన్‌లాల్ అధ్యక్షతన పార్టీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు వంటి పథకాలను కొనసాగించే పరిస్థితి లేదని విమర్శించారు. పదేండ్ల తర్వాత మళ్లీ తెలంగాణలో సాగు, తాగు కష్టాలను చూస్తున్నామని తెలిపారు. కేసీఆర్ నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే తపించేవారని, తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరగిన పొరపాటును ప్రజలు కొద్దిరోజులకే తెలుసుకున్నారని, మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నాని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు పూర్వవైభవం రావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించుకొని కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ వాంకడోత్ జగన్, బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ మార్కెట్‌లో బస్తాలను మోస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మార్కెట్‌లో బస్తాలు మోసిన ఆర్ఎస్పీ

కొల్లాపూర్, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని జాఫర్ మైదానంలో ఆదివారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా క్రీడాకారులు, సీనియర్ సిటిజన్స్‌తో మాట్లాడారు. అలాగే కూరగాయల మార్కెట్‌లో చిరువ్యాపారులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. మార్కెట్‌లో ట్రాన్స్‌పోర్టు లారీ వద్దకు వెళ్లి హమాలీల కష్టాలు తెలుసుకోవడంతోపాటు బస్తాలు మోసి ఓట్లను అభ్యర్థించారు. బస్టాండ్‌లో ఉద్యోగులు, ప్రయాణికులతో కాసేపు ముచ్చటించారు. పట్టణంలోని పలుచౌరస్తాల్లో ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్